'స్మార్ట్'గా సీబీఎస్ఈ చదువులు

- కేడీపీఎం స్కూల్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- సుశిక్షితులైన ఉపాధ్యాయులు
- అధునాతన బోధన విధానాలు



కేడీపీఎం పాఠశాల



ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఏర్పాటు చేసిన తరగతి గదిలో విద్యార్థులు

ఏయూ క్యాంపస్: సీబీఎస్ఈ చదువులు అంటే ఇప్పటి వరకు కార్పొరేట్ స్కూళ్లకే పరిమితం. సర్కారు బడుల్లో ఆ మాట వినిపించడం అరుదు. ఇది ఒకప్పటి మాట. రోజులు మారాయి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీబీఎస్ఈ సిలబస్ అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచి తూర్పు నియోజకవర్గం పరిధి కేడీపీఎం జీవీఎంసీ స్మార్ట్‌సిటీ ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌లో తరగతుల నిర్వహణకు సన్నద్ధం అవుతున్నారు.

సెక్షన్‌కు 40 మంది విద్యార్థులు

సీబీఎస్ఈ బోధనలో భాగంగా తరగతి గదికి కేవలం 40 మంది విద్యార్థులను పరిమితం చేస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో తొమ్మిదో తరగతిలో 178 మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో నాలుగు సెక్షన్లుగా విభజించనున్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే అదనపు సెక్షన్ పెట్టే అవకాశం కూడా ఉంది. విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయనున్నారు.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం

ప్రస్తుతం పాఠశాలలో 28 మంది అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం పని చేస్తుంది. వీరిలో అందరూ బీఈడీతో పాటు పీజీ, ఎం.ఫిల్ చేసిన వారు ఉన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారు కళాశాల అధ్యాపకులుగా అర్హులు. ఇటువంటి ఉన్నత విద్యావంతులు, దశాబ్దాల బోధన అనుభవం కలిగిన ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ సిలబస్ బోధన కష్టమైన అంశం ఎంత మాత్రం కాదు. స్టేట్ సిలబస్‌కి, సీబీఎస్ఈ సిలబస్‌కి కొద్దిపాటి వ్యత్యాసం మాత్రమే ఉంటుంది. ప్రాథమిక అంశాలు ప్రతి శాస్త్రంలోనూ ఒకేలా ఉంటాయి.

డిజిటల్ విధానంలో..

బోధన మరింత ఆసక్తిదాయకంగా, సమర్థవంతంగా నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా పాఠశాలలో ఇప్పటికే ఇంటరాక్టివ్ ఫ్లాట్ పేనల్స్‌ని 17 ఏర్పాటు చేశారు. ఏపీ ఫైబర్‌నెట్ సదుపాయం కల్పించారు. దీంతో మరింత సమర్థవంతంగా విద్యార్థికి సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన జరిపే అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం 9 తరగతిలో ఉన్న విద్యార్థులకు ఇప్పటికే బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను కూడా అందించారు.

- ఇప్పటికే 9వ తరగతి విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు కూడా పాఠశాలకు చేరుకున్నాయి. ముందుగానే ఇండెంట్ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం వీటిని సకాలంలో విద్యార్థులకు అందించేలా సిద్ధం చేసింది.
- సీబీఎస్ఈ సిలబస్‌లో ఐటీ ఒక సబ్జెక్టుగా ఉంటుంది. ప్రస్తుతం పాఠశాలలో పని చేస్తున్న వారిలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదివిన వారు ఉన్నారు. వారు ఈ ఐటీ సబ్జెక్టులను బోధించడానికి సరిపోతారు.

ప్రత్యేక ప్రణాళిక.. శిక్షణ

పాఠశాల హెచ్‌ఎంలకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జాతీయ స్థాయిలో ఐఐఎం అహ్మదాబాద్‌లో లీడర్‌షిప్-కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని వారం రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో విజయవాడలో సైతం శిక్షణ ఇచ్చారు. అధ్యాపకుల నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడానికి దీక్ష యాప్‌లో ఆన్‌లైన్ కోర్సులు, సర్టిఫికెట్ ప్రోగ్రాం నిర్వహణ జరుగుతోంది. వీటితో పాటు గతంలో ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాలను సైతం నినర్వహించారు. వీటితో ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ బోధన విధానంపై సంపూర్ణ అవగాహన ఇప్పటికే కల్పించారు.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన



ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కేడీపీఎం పాఠశాలలో 9వ తరగతిలో సీబీఎస్ఈ బోధన ప్రారంభిస్తున్నాం. బోధన కోసం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అవసరమైన అన్ని వనరులు ఉన్నాయి.

– సుమతీభాయి, ప్రధానోపాధ్యాయిని, కేడీపీఎం పాఠశాల

సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక పురోగతి

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల
- 27వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వ'



ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం : సంక్షేమ పథకాల అమలుతోనే పేదల ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 27వ వార్డు అమర్‌నగర్‌లో మంగళవారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాల కారణంగా పొందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకున్న సమస్యలపై ఆరా తీశారు. పలు సమస్యలకు అక్కడికక్కడే సచివాలయ సిబ్బందితో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఆయా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సొంతింటి కల నెరవేర్చడానికి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు.

వలంటీర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



ఆరిలోవ కాలనీ ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ కెల్ల సునీత మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు యూనిఫారం, పుస్తకాలు అందిస్తుందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.ఎస్.ఎస్.ఎన్.రాజు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమాంబ పండగ





ఇసుకతోటలో కనకమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, సంఘం ప్రతినిధులు బొట్టా కృష్ణ, గణేష్

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు పరిధి ఇసుకతోట గ్రామ ఇలవేల్పు శ్రీకనకమాంబ అమ్మవారి వార్షిక పండగ మంగళవారం ఘనంగా జరిగింది. శ్రీకృష్ణా ఉమామహేశ్వర సాయి దుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేకువ జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి చీరలు, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, తదితరులు దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు.

ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు గొలగాని రాము, ప్రసాదులు పోలారావు, అధ్యక్షుడు ఈగల శివ గోవింద్, పల్లా అప్పారావు, మాజీ అధ్యక్షుడు బొట్టా శివ, సంఘం ప్రతినిధులు బొట్టా గణేష్, పల్లా శివ, మువ్వల శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్‌లో రాణిస్తున్న వెన్నెలకు సత్కారం



తోటగరువు పూర్వ విద్యార్థి వెన్నెలను అభినందిస్తున్న హెచ్‌ఎం దుర్గాభవాని, ఉపాధ్యాయులు

ఆరిలోవ: క్రికెట్‌లో రాణిస్తున్న తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని వెన్నెల మోహన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం సత్కరించారు. ఈమె హైస్కూల్‌లో చదువుకున్నప్పటి నుంచి క్రికెట్‌లో శ్రద్ధ చూపించేది. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు విజయనగరంలో జరిగిన మహిళల ఆంధ్రా ప్రీమియం లీగ్(ఏపీఎల్)లో వెన్నెల బౌలింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా మంగళవారం ఆమెను తోటగరువు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం జి.కె. దుర్గాభవాని మాట్లాడుతూ ఏపీఎల్‌లో వెన్నెల అత్యధికంగా 12 వికెట్లు తీసి బౌలింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పర్పుల్ కేప్ సాధించిందని కొనియాడారు. ఆమె క్రికెట్‌లో మరింత ఉత్తమ ప్రతిభ కనబరిచి భారత్ తరఫున ఆడగలిగే అవకాశం రావాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీ రోడ్డు విస్తరణకు సర్వే



హెచ్‌బీ కాలనీ, వెంకోజీపాలెం రోడ్డు విస్తరణ కోసం సర్వే చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

మద్దిలపాలెం : హెచ్‌బీ కాలనీ నుంచి వెంకోజీపాలెం రోడ్డు విస్తరణ కోసం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేపట్టారు. నాలుగు రోజులుగా రోడ్డు విస్తరణకు సంబంధించి సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అయితే ఈ రోడ్డులో ప్రైవేట్ స్థలం ఉండడంతో విస్తరణకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సదరు స్థల యజమానులతో టౌన్ ప్లానింగ్ అధికారులు చర్చలు జరుపుతున్నారు. సర్వే అనంతరం రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో 30 మంది ఉత్తీర్ణత

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం పక్కన శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలలో 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మంగళవారం విడుదల చేసిన ఈ ఫలితాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 21 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9 మంది ఉత్తీర్ణులైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.కె.రమేష్ తెలిపారు. ఈ సప్లిమెంటరీ పరీక్షలు మొదటి సంవత్సరం 33 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 19 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఆయన తెలిపారు.

లాసన్స్‌బే కాలనీలో పడకేసిన పారిశుధ్యం



లాసన్స్‌బే కాలనీలోని ఓ వీధిలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఎంవీపీ కాలనీ: లాసన్స్‌బే కాలనీలో పారిశుధ్యం పడకేసింది. ఏ వీధిలో చూసిన వ్యర్థాలు, చెత్త పేరుకుపోయాయి. కొద్ది రోజులుగా వ్యర్థాలు సక్రమంగా తరలించకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. చెత్త తరలింపులో పారిశుధ్య విభాగం నిర్లక్ష్యం వహిస్తున్నారని, రోడ్లను సైతం శుభ్రం చేయడం లేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదని వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కృష్ణా కళాశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాల జాబితాను ప్రిన్సిపాల్‌కు అందిస్తున్న పూర్వ అధ్యాపకుడు పార్వతీశం

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ అధ్యాపకుడు బి.పార్వతీశం బీఏ, బీకామ్, బీఎస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. తాతయ్య, చినబాబు, అమ్మమ్మ, ఆదెమ్మల పేరిట నాలుగు ప్రతిభా పురస్కారాలను మంగళవారం ప్రదానం చేశారు. ఎంపిక చేసిన విద్యార్థుల జాబితాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబుకు పార్వతీశం అందించారు. పనిచేసిన కళాశాలలో విద్యార్థుల ఉన్నతికి ప్రతి ఏటా పురస్కారాలు అందించి ప్రోత్సహిస్తున్న పార్వతీశంను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు ఉమామహేశ్వరరావు, సిహెచ్.అనురాధ, జి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ సమావేశం



గ్రంథాలయ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

డాబాగార్డెన్స్: జిల్లా గ్రంథాలయ సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్, సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుడు ఆమోదించి పంపిన వివిధ పద్దుల కింద ఖర్చు చేసేందుకు నిర్వహించిన సమావేశంలో వివిధ పద్దుల కింద ఖర్చు చేయాల్సిన మొత్తాలను చర్చించి ఆమోదించారు. సమావేశంలో కొండా రాజీవ్‌గాంధీ, గ్రంథాలయ సంస్థ సభ్యురాలు జ్యోతి, వయోజన విద్య ఉప సంచాలకుడు ఎస్. సుబ్రహ్మణ్యవర్మ, జిల్లా పంచాయతీ అధికారి ఎం. వాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

మద్దిపాలెం : నిత్యం ట్రాఫిక్‌జామ్‌కు కారణమవుతున్న రైతుబజార్ వద్ద ఆక్రమణలను తొలగించారు. ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్ఐ పాపారావు సమక్షంలో కానిస్టేబుళ్లు మంగళవారం ఆక్రమణలు తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న తోపుడుబండ్లు, హాకర్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తోపుడు బండ్లు హాకర్‌జోన్లలో మాత్రమే ఉంచి వ్యాపారాలు సాగించాలని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తల్లి చెంతకు కుమార్తె

గోపాలపట్నం: పాత గోశాల వద్ద తల్లితో నివాసముంటున్న ఓ బాలిక సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు ఆమెను వెదికి పట్టుకుని, తల్లి చెంతకు చేర్చారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామలక్ష్మి ఓ ఆఫీస్‌లో అటెండర్‌గా పని చేస్తోంది. ఈ నెల 12న ఆమె విధులకు వెళ్లిన సమయంలో బాలిక బయటికి వెళ్లింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో తల్లి రామలక్ష్మి గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఈదుల నరసింహారావు వెంటనే స్పందించి సెల్‌ఫోన్ నెట్‌వర్క్ ద్వారా మాడుగులలో ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడి నుంచి సిబ్బందిని పంపి మంగళవారం తీసుకొచ్చి తల్లికి అప్పగించారు.

కళాశాలలో 'నారాయణ అండ్ కో' సందడి



విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న చిత్ర దర్శకుడు చిన్న పాపిశెట్టి

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నారాయణ అండ్ కో చిత్ర యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కళాశాలను సందర్శించి, అక్కడి విద్యార్థులతో చిట్‌చాట్ చేశారు. చిత్ర కథానాయకుడు సుధాకర్ కాముకల, కథానాయిక ఆర్తి, దర్శకుడు చిన్న పాపిశెట్టి, నటి ఆమని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా చిత్రాన్ని రూపొందించామన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు ఉచిత వైద్య సేవలు



ఉచిత వైద్య సేవలు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మెడికవర్ ఆస్పత్రి ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: ఉత్తరాంధ్రలోని గ్రామీణ వైద్యుల సౌకర్యార్థం మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం ఉచిత ప్రత్యేక ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు బ్రోచర్‌ను ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రిలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రతినిధుల సమక్షంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ ప్యాకేజీలో భాగంగా గ్రామీణ వైద్యులకు మూడు నెలల వ్యవధిలో ఈ వైద్య సేవలు అందించనున్నారు. సీబీసీ, సీయూఈ, లిపిడ్ ప్రొఫైల్, ఎల్ఎఫ్‌టీ, బ్లడ్ యూరియా, క్రియేటినైన్, ఈసీజీ, ఈఎస్ఆర్, జనరల్ ఫిజిషియన్, కార్డియాలజీ, డైటీషియన్ కన్సల్టేషన్ వైద్య సేవలను అందించనున్నారు. మెడికవర్ ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ అడ్మిన్ పద్మజ మాట్లాడుతూ ఈ సదవకాశాన్ని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ డాక్టర్ శ్రీధర్, సంఘం అధ్యక్షుడు జె.జోషి, విశాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే కీలకమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో మాత్రమే కార్మికులకు వేతనాలు సరిగ్గా అమలవుతున్నాయని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద మంగళవారం 852వ రోజు రిలే నిరాహార దీక్షలో సంస్థలోని ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, ప్లాంట్‌కు భూములు ఇచ్చిన నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

సీతమ్మధార: ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ విద్యార్థి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రీన్‌పార్కు కాలనీలో హేమేశ్వరరావు, భార్య, కుమారుడు నివాసం ఉంటున్నారు. సీతమ్మధారలోని బాలయ్య శాస్త్రిలేఅవుట్ ఓ స్కూల్‌లో టీఎన్‌వీపీ నాథల్ 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం 4 గంటలకు స్కూల్ నుంచి నడుచుకుంటూ పెట్రోల్ బంక్ రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయపడిన నాథల్‌ను సమీపంలోని ఓ ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేస్తున్నారు. బాలుడు తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ వి.శ్రీనివాసరావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సీసీ ఫుటేజ్ ద్వారా ఢీకొట్టిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

మాతృ మరణాల నివారణ బాధ్యత వైద్యులదే



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లాలో మాతృ మరణాలు సంభవించరాదని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీకాంత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కారాదన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మాతృ మరణాలు జరిగితే దానికి వైద్యులు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. గర్భిణుల వివరాల నమోదు నాటి నుంచి ప్రసవించే వరకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీడీ డి.వెంకటలక్ష్మి, వీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, గైనిక్ వైద్యులు డాక్టర్ సువర్ణ, డాక్టర్ శ్రీలక్ష్మి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమావతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

ఐఎస్ఎంసీ సభ్యుడిగా హనుమంతు పురుషోత్తం



ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ–ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఇంక్యుబేటర్ సీడ్ ఫండ్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఐఎస్ఎంసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మరట్‌వాడా యూనివర్సిటీలో(బీఏఎంయూ)ని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఐఎస్ఎంసీ ఏర్పాటైంది. దీనిలోని 11 మంది సభ్యుల్లో ఒకరిగా డాక్టర్ పురుషోత్తం నియమితులయ్యారు. నీతి అయోగ్, మహారాష్ట్ర ఇన్నోవేషన్ సొసైటీ సంయుక్తంగా ఏఐసీ–బీఏఎంయూని ఏర్పాటు చేశాయి. డీపీఐఐటీ రిజిస్ట్రేషన్ చేసుకున్న స్టార్టప్‌లు సీడ్ ఫండ్‌కి దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్టంగా రూ.50 లక్షల వరకు ఈ కమిటీ పరిశీలించి సీడ్ ఫండ్ అందిస్తుంది.

మహిళా కళాశాలలో యోగా కార్యక్రమం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యోగా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి విద్యార్థులకు యోగా విశిష్టత గురించి వివరించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఎ. హైమావతి, ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ కె. ప్రశాంతి, ట్రైనర్ బి. సునీల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకట శివ ప్రతాప్ (ఫైల్)

అల్లిపురం: భార్యతో తగాదాలు, కోర్టు గొడవల కారణంగా వ్యక్తి అదృశ్యమైన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం డాబాగార్డెన్స్, చాకలివీధికి చెందిన కిలాడి వెంకట శివప్రతాప్ ఈ నెల 3న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని అతని సోదరుడు వేణు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన వ్యక్తి సుమారు 5.9 అడుగుల ఎత్తు కలిగి, నల్లటి శరీర ఛాయతో ఉంటాడని, తప్పిపోయినప్పుడు రెడ్ కలర్‌పై గీతల గల చొక్కా వేసుకుని ఉన్నాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 0891-2783672, 8919812412 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.